VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

**కలం కౌంటర్**
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 253
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శనివారం 21 ఫిబ్రవరి 2026

# ఆ రోజు త్వరలోనే వస్తుంది: ఢిల్లీ ఏఐ సమ్మిట్ లో సీఎం చంద్రబాబు



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో ప్రపంచ పటంలో నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన దార్శనికతను ఆవిష్కరించారు. సమీప భవిష్యత్తులోనే అమరావతి 'క్వాంటం వ్యాలీ'గా, విశాఖపట్నం 'ఏఐ డేటా హబ్'గా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ప్రధాని మోదీ ఆకాంక్షకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ తన వంతు పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026'లో భాగంగా శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. 'కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం' అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "త్వరలోనే అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా మాట్లాడే రోజు వస్తుంది. కేవలం వినియోగించుకోవడమే కాకుండా, ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను తయారు చేసి, ఎగుమతి చేసేలా ఇక్కడ ఒక ప్రత్యేకమైన క్వాంటం ఎకో సిస్టంను రూపొందిస్తున్నాం" అని వివరించారు. గూగుల్ వంటి దిగ్గజ సంస్థల రాకతో విశాఖపట్నం ఒక కీలకమైన ఏఐ డేటా హబ్‌గా మారుతుందని తెలిపారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా 'సావరిన్ ఏఐ'ని వినియోగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, డీప్ టెక్నాలజీ రంగంలో ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ వంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని, ఈ రంగాల్లో భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలు సాధిస్తుందన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని, ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

# ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న హోం మంత్రి అనిత






**అమరావతి,కలంకౌంటర్ :** మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీ ఎస్పీలో రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐజీపీ స్పోర్ట్స్ కే.వి. మోహన్ రావు, డీఐజీ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ కేకేఎన్ అనుబు రాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసు జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. సుమారు ఆరు రాష్ట్రాల నుంచి మొత్తం 10 జట్లు పోటీ పడుతున్నాయి.ప్రారంభ కార్యక్రమంలో హోం మంత్రి అనిత పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం టి20 టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ మ్యాచులు ఐదు రోజుల పాటు మూలపాడు గ్రౌండ్లో జరగనున్నాయి. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, పోలీసులు అనునిత్యం ప్రజా భద్రత కోసం 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు పోలీసుల్లో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, శారీరక–మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ముఖ్యం గాని గెలుపు మాత్రమే లక్ష్యం కాదని ఆమె స్పష్టం చేశారు. అమరావతి ప్రజల రాజధాని అని, దానిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనితను పోలీసులు ఘనంగా సత్కరించారు.

# రాష్ట్ర భవిష్యత్తును మార్చేలా రేర్ ఎర్త్ మినరల్ కారిడార్

- అపార ఖనిజ వనరుల్ని అభివృద్ధికి వినియోగించుకుందాం
- గత ఐదేళ్లు మైనింగ్ రంగాన్ని దోపిడీ కోసం వాడుకున్నారు
- రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకంతో పాటు వేల్యూ ఎడిషన్ అత్యవసరం
- ఇంటిగ్రేటెడ్ వేల్యూ చైన్ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించిన మంత్రి కొల్లు రవీంద్ర

2లో



# వెంకన్న ఆగ్రహానికి గురికాక తప్పదు

## • జగన్ కు, వైసీపీ సభ్యులకు మంత్రి సవిత హెచ్చరిక



**అమరావతి,కలంకౌంటర్ :** హిందువుల మనోభావాలు దెబ్బతినేలా శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరుపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంకన్న ఫొటోలను సభలో విచ్చలవిడిగా పడేసి అపచారానికి పాల్పడ్డారని, ఆ కలియుగ దైవం ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తక్షణమే హిందువులకు, ప్రజలకు జగన్, వైసీపీ సభ్యులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరు గర్హనీయమన్నారు. కలియుగ దైవం వెంకన్న స్వామి ఫొటోలతో రాజకీయం చేయడం క్షమించరాని నేరమన్నారు. తెలుగు జాతి ఇలవేల్పు వెంకటేశ్వర స్వామి ఫొటోలతో ఉన్న ప్లకార్డులను మండలిలో ఇష్టారాజ్యంగా పడేసి మహా అపచారానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ రెడ్డి సూచన మేరకే తమ రాజకీయాల కోసం శాసన మండలిలో వెంకన్న స్వామి ఫొటోలను వైసీపీ సభ్యులు వాడుకున్నారని మండిపడ్డారు. వారంతా హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారని, తక్షణమే హిందూ సమాజానికి జగన్, వైసీపీ ఎమ్మెల్సీలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకన్న ఆగ్రహానికి జగన్ , వైసీపీ సభ్యులు గురికాక తప్పదని మంత్రి సవిత హెచ్చరించారు.

**నీచానికి దిగజారిన వైసీపీ..** మహిళలన్నా గౌరవం లేదని, ప్రజల పట్ల బాధ్యతలేదని వైసీపీ సభ్యులపై మంత్రి సవిత మండిపడ్డారు. చివరికి దైవం పట్ల పాపభీతి కూడా లేదన్నారు. ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి పాపం మూటకట్టుకున్నారని, ఇదే విషయం సీబీఐ వేసిన సిట్ సైతం స్పష్టం చేసిందని తెలిపారు. ఈ అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి, సభలో చర్చలకు ఆటంకం కలిగించడానికి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ సభ్యులు రచ్చ చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలతో పాటు తిరుపతి లడ్డూ అంశంపైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినా వైసీపీ సభ్యులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తమ తప్పులు బయటపడకుండా వైసీపీ సభ్యులు ఎంతటి నీచానికైనా దిగజారిపోతున్నారని, సభను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం బయటకు రావడంతో జగన్, వైసీపీ సభ్యులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలను వారిని పట్టించుకోవడం మానేశారని అన్నారు. 33 ఏళ్ల నుంచి హెరిటేజ్ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని వ్యాపార ప్రస్థానాన్ని ముందుకు సాగిస్తోందన్నారు. హెరిటేజ్ కు, టీటీడీకి ఎటువంటి సంబంధమూ లేదని మంత్రి సవిత తేల్చిచెప్పారు.

# ప్రగతి పథంలో చిత్తూరు నగరం

- జిల్లా కేంద్రం సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్
- చిత్తూరు నగరంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు



**చిత్తూరు,కలంకౌంటర్ :** జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరం తరగతి పదములో పయనిస్తుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తూరు నగర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని వారు ఉద్ఘాటించారు. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో ని 10 వార్డు శాంతి నగర్లో 7.25 లక్షలు, అలాగే 15 డివిజన్లో -9 లక్ష్యలతో నూతనంగా ఏర్పాటుచేసిన సీ.సీ రోడ్లను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజా సేవే పరమావధిగా భావించి తాము పని చేస్తున్నామని తెలిపారు. చిత్తూరు నగర రూపురేఖలు మార్చడమే తమ సంకల్పమన్నారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చూడ ఛైర్పర్సన్ కఠారి హేమలత, మార్కెట్ చైర్మన్ ఝాన్సీ వెంకటేష్, 10 వార్డు, 15 డివిజన్ కూటమి, నాయకులు కార్యకర్తలు, నగరపాలక సంస్థ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# రాష్ట్ర భవిష్యత్తును మార్చేలా రేర్ ఎర్త్ మినరల్ కారిడార్

● అపార ఖనిజ వనరుల్ని అభివృద్ధికి వినియోగించుకుందాం ● గత ఐదేళ్లు మైనింగ్ రంగాన్ని దోపిడీ కోసం వాడుకున్నారు ● రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకంతో పాటు వేల్యూ ఎడిషన్ అత్యవసరం ● ఇంటిగ్రేటెడ్ వేల్యూ చైన్ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించిన మంత్రి కొల్లు రవీంద్ర

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర భవిష్యత్తును సమగ్రంగా మార్చేలా మన ఖనిజ వనరుల్ని సద్వినియోగం చేసుకుంటామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకరరావు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో సమాధానమిచ్చారు. ఉత్తరాంధ్ర సహా సుమారు 970 కి.మీల మేర ఉన్న సముద్ర తీరంలో అపారమైన సహజ సంపద ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపే అవకాశం లభిస్తుందన్నారు. అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ఫ్లోరేషన్ అండ్ రీసెర్చ్‌పై ఆధారపడి దాదాపు 102 మిలియన్ టన్నుల నిల్వలతో రాష్ట్ర ప్రభుత్వం 7,762 హెక్టార్లలో 8 బీచ్ శాండ్ కలిగి ఉన్న ప్రాంతాలను గుర్తించింది. ఈ ప్రాంతాలను ఏపీఎండీసీకి రిజర్వ్ చేసేలా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి డిపార్ట్ మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ, కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ 97 మిలియన్ టన్నుల నిల్వతో గార మండలంలో 670 హెక్టార్లు, 239 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రెండు బీచ్ శాండ్ ప్రాంతాలను ఏపీఎండీసీకి మైనింగ్ లీజు మంజూరు చేయడానికి సిఫార్సు చేశాం. గార మండలంలో 909 హెక్టార్లకుపైగా ఏకీకృత లీజు కోసం ఏపీఎండీసీకి ఎల్వోఐ జారీ చేసింది. మిగిలిన ఆరు బీఎస్ఎం బేరింగ్ ప్రాంతాల్లో డిపార్ట్ మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ ఇటీవల 41 మిలియన్ టన్నుల నిల్వలు, ఎచ్చెర్ల రణస్థలం గార మండలాల్లో మూడు బీఎస్ఎం బేరింగ్ ప్రాంతాలకు మైనింగ్ లీజులను మంజూరు చేయడానికి ఏపీఎండీసీని నామినేట్ చేసింది. చట్టబద్ధమైన అనుమతులు పొందే ప్రక్రియ కొనసాగుతోంది. బీచ్ శాండ్ ఖనిజ నిక్షేపాలతో శ్రీకాకుళం జిల్లాలో అందుబాటులో ఉన్న 4 క్వారీ లీజులు క్వార్ట్జ్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, గ్రావెల్, రోడ్



మెటల్, బిల్డింగ్ స్టోన్ సహా మాంగనీస్ కోసం కాంపోజిట్ లైసెన్స్ కూడా అమలు చేయడం జరిగింది. శ్రీకాకుళం జిల్లాలో పేర్కొన్న ఖనిజాల కోసం 301 లీజులు 1359 హెక్టార్లు, మాంగనీస్ బ్లాక్ 152 హెక్టార్లలో విస్తరించి ఉంది. రాష్ట్రంలో అత్యంత విలువైన బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రంలోని సహజ వనరుల్ని దోపిడీ కోసం వాడుకున్నారు. లీజు దారుల్ని బెదిరించి లాక్కున్నారు. పెనాల్టీలతో వేధింపులకు గురి చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లీజుదారులకు అండగా నిలుస్తూ.. అన్ని లీజుల్ని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం తాజాగా క్రిటికల్ మినరల్ పార్కులు ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు కారిడార్ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపులు కూడా చేశారు. మన దేశంలో విలువైన వనరులు ఉన్నప్పటికీ వాటిని ప్రాసెస్ చేసే వ్యవస్థ లేకుండా పోయింది. కానీ నేడు వాటిని ప్రాసెస్ చేసి వేల్యే యాడెడ్ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. వనరుల్ని ఉత్పత్తి చేయడం కాకుండా.. ఇంటిగ్రేటెడ్ వేల్యూ చైన్ ఏర్పాటు ద్వారా రేర్ ఎర్త్ మినరల్స్ తయారీ వ్యవస్థకు కీలకంగా ఏపీని మార్చబోతున్నాం. దేశ వ్యాప్తంగా ఉన్న మోనోజైట్ నిల్వల్లో ఏపీలోనే 30 శాతానికి పైగా ఉన్నాయి. అయస్కాంతాల తయారీకి వినియోగించే నియోడైమియం, ప్రసియోడైమియం ఆధారమైన మోనోజైట్, ఏరోస్పేస్‌లో కీలక భూమిక పోషించే టైటానియం ఇల్మెనైట్, సిరామిక్స్ అండ్ న్యూక్లియర్ ఎనర్జీలో కీలకంగా ఉపయోగించే జిర్కాన్, పారిశ్రామిక రంగంలో ఉపయోగించే గార్నెట్ సిల్లిమనైట్ లాంటి ఖనిజాలు ఆంధ్రప్రదేశ్ తీరంలో అత్యంత కీలకంగా లభిస్తున్నాయి. మన సముద్ర తీరంలో లభించే సంపదను మన రాష్ట్ర అభివృద్ధికి, మన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పురావస్తు తవ్వకాలు - బౌద్ధ సర్క్యూట్ అభివృద్ధికి పెద్దపీట - మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం

## కేంద్ర సహకారంతో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ క్షేత్రాలు అభివృద్ధి

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు, పురావస్తు తవ్వకాలను ముమ్మరం చేయడంతో పాటు బౌద్ధ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ క్లుప్తంగా సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్ లో 65 ప్రాంతాల్లో, విభజన తర్వాత పురావస్తు శాఖ 3 ప్రధాన ప్రాంతాల్లో ఫీల్డ్ సీజన్ లో పురావస్తు శాఖ తవ్వకాలు జరిపిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 2014-15, 2015-16లో జరిపిన తవ్వకాల్లో కాకినాడ జిల్లా ఎ.కొత్తపల్లి (పెద్దమెట్ట) బౌద్ధ క్షేత్రంలో మహాస్థూపాలు,8 ఓటివ్ స్థూపాలు (చిన్న స్థూపాలు), విహారాలు(నివాస ప్రాంతాలు), ఎర్రమట్టి పాత్రలు బయటపడ్డాయని.. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తవ్వకాలు జరపడం కష్టమని భావించి పోలవరం ముంపు ప్రాంతాలైన రుద్రమకోట, రాయనపేటలలో 2017-18 లో తవ్వకాలు జరపగా క్రీ.పూ. 1000-300 నాటి ప్రాచీన మానవుడి సమాధులు (మెగా లిథిక్స్), ఇనుప వస్తువులు, మట్టి పాత్రలు లభ్యమయ్యాయని వివరించారు. తద్వారా ప్రాచీన మానవుడి కాలం నాటి సంస్కృతి, అనుసరించిన విధానాలు గుర్తించామన్నారు. ఈ తవ్వకాలకు ప్రత్యేక బడ్జెట్ అంటూ ఏమీ లేదని పోలవరం ప్రాజెక్టులో భాగంగా పురావస్తు శాఖ ఎక్స్ కవేషన్ బడ్జెట్ లో నుండి వినియోగించి తవ్వకాలు జరిపామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా ఉన్న ఏపీ పురావస్తు సంపదను తీసుకురావాలని, రాష్ట్ర విభజనకు ముందు జరిపిన తవ్వకాల నివేదికను రాష్ట్ర ప్రజల ముందుంచాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మంత్రి దుర్గేష్ ను కోరారు. తెలంగాణలో ఉండిపోయిన ఏపీ పురావస్తు సంపదను తిరిగి రప్పించే విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగాయని, హైదరాబాద్ లో ఒకసారి సమావేశం కూడా జరిగినట్లు వివరణనిచ్చారు. త్వరలోనే ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో దీనిని పూర్తి



చేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన విధంగా పురావస్తు శాఖ ద్వారా మరిన్ని తవ్వకాలు చేపట్టం, దొరికిన అవశేషాలను నిక్షిప్తం చేయడం, సంబంధిత అంశాలను గ్రంథస్తం చేయడం వాటిని ప్రజల సందర్శనార్థం మ్యూజియంలో పెట్టడం ఆవశ్యకమని భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 154 పోస్టులకు గాను 54 మంది సిబ్బంది ఉన్నారని సిబ్బంది కొరతను తీర్చాలని కోరారు. కళింగుల రాజధానిగా కీర్తిపొందిన శ్రీకాకుళం జిల్లా దంతపురం, విజయనగరం జిల్లా గుడివాడకొండలలో రాబోయే రోజుల్లో తవ్వకాలు చేపడతామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. పురావస్తు శాఖలో సిబ్బంది కొరతను తీర్చడం, తవ్వకాల్లో దొరికిన అవశేషాలను భద్రపరిచి మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. హైదరాబాద్ లోని మ్యూజియం మాత్రమే కాక ఏలూరులోని మ్యూజియం, రాజమహేంద్రవరంలోని రాళ్ల బండి సుబ్బరావు మ్యూజియంలకు ప్రత్యేక చరిత్ర ఉందని ఆయా మ్యూజియాల్లో సంబంధిత నివేదికలు పొందుపరిచేందుకు అవకాశం ఉందన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు(బేబీ నాయన) అడిగినట్లుగా చిత్రకోట బౌద్ధక్షేత్రం అంశం తమ పరిగణలో ఉందన్నారు. ఏపీలో బౌద్ధమత వ్యాప్తికి నిలయాలైన అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి 'బౌద్ధ సర్క్యూట్'గా అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సహకారంతో, కేంద్ర బడ్జెట్ కేటాయింపులను ఉపయోగించుకుని అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. గతేడాది కేంద్ర ప్రభుత్వ అనుమతితో వియత్నాంలో బుద్ధుడి పవిత్ర అవశేషాల (హోలీ రిలిక్స్) ప్రదర్శనలో కేంద్రమంత్రి రిజిజుతో పాల్గొన్న అనుభవాన్ని మంత్రి దుర్గేష్ గుర్తుచేసుకుంటూ.. ప్రపంచవ్యాప్తంగా బుద్ధుడి బోధనలకు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఏపీలోని బౌద్ధ క్షేత్రాలను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నాడు వియత్నాంలో బుద్ధుడి అవశేషాల ప్రదర్శనలో అక్కడి భక్తుల భక్తిని చూస్తే ఆశ్చర్యమేసిందని, ఆ సమయంలో ప్రతి ఒక్కరూ సాష్టాంగ నమస్కారం చేయడం గొప్పగా అనిపించిందన్నారు. గడిచిన పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా బుద్ధుడు పుట్టి, పెరిగి, సంచరించిన ప్రాంతాలను ఒక సర్క్యూట్ గా, బౌద్ధ మత వ్యాప్తి జరిగిన ప్రాంతాలను ఒక సర్క్యూట్ గా చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఏపీలో బౌద్ధమత వ్యాప్తి జరిగిన బౌద్ధ క్షేత్రాలను సర్క్యూట్ గా చేయాలని ఇప్పటికే టూరిజం శాఖ, పురావస్తు శాఖ సంయుక్తంగా కేంద్రాన్ని కోరిందని, తాము కేంద్రానికి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన వెంటనే బుద్ధిస్ట్ సర్క్యూట్ లకు సంబంధించిన అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి దుర్గేష్ సభకు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ.. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక అంశాలపై మండలి బుద్ధ ప్రసాద్ కు ఉన్న శ్రద్ధను, మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తిని అభినందించారు. కేంద్రం నుండి నిధుల సాధన కోసం తామంతా కలిసి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు - మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి,కలంకౌంటర్ :** శాసనసభలో శుక్రవారం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్, విపత్తు నిర్వహణ పద్దు కింద రూ. 3,867.53 కోట్ల బడ్జెట్ కేటాయింపులను రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాన సత్యప్రసాద్ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా బడ్జెట్ కేటాయింపులపై జరిగిన చర్చలో మంత్రి అనగాని మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పాపాలను ఇప్పటికీ కడుగుతూ ఉన్నామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో వైసీపీ నేతలు ప్రభుత్వ, ప్రజల భూములను కబళించారని అన్నారు. రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ను అడ్డం పెట్టుకొని లక్షా 75 వేల ఎకరాలను కాజేయలని ప్రయత్నించారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ వ్యవస్థలో పూర్తి స్థాయి సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే డిజిటల్ వ్యవస్థలో కలిపి..ట్యాంపర్ చేయడానికి వీలులేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భూమి రికార్డులను భద్రంగా ఉంచుతున్నామన్నారు. పాత రెవెన్యూ రికార్డులను అత్యాధునిక టెక్నాలజీతో స్కాన్ చేసి, సురక్షిత మరియు శాశ్వత డిజిటల్ గుర్తింపుతో భద్రపరుస్తున్నామని, దీంతో ఫైల్ పోయింది అనే సమస్య ఉండదని, బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా లిటిగేషన్ సమస్యలను కూడా తగ్గుతాయని చెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న పాత పొరపాట్లను సరిచేసే ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని, దీని వల్ల విశ్వసనీయ, ఖచ్చితమైన, వివాదాలకు ఆస్కారం లేని భూ రికార్డులు



సిద్ధమవుతాయని చెప్పారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో రెవెన్యూ క్లినిక్స్ నిర్వహించి రెవెన్యూ అధికారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి అక్కడికక్కడే ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. కేసుల స్థితిని ఆన్లైన్‌లో తెలుసుకునేందుకు మరియు పర్యవేక్షించేందుకు ఆన్లైన్ రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి తన బొమ్మల పిచ్చితో తప్పులతో కూడిన నాసిరకం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని మిమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం పట్టాదార్ పాస్‌బుక్ ముద్రించే ముందు వఖ్జ ద్వారా ప్రతి వ్యక్తి తన వివరాలను చెక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని, పొరపాట్లు ఉంటే గ్రామానికే వచ్చి సరిచేస్తారని, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అన్నారు. రీ-సర్వే చేసిన గ్రామాల్లో రాజముద్రతో 15 రకాల రక్షణ అంశాలతో కూడిన పొరపాట్లు లేని పట్టాదార్ పాస్‌బుక్ అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాపాల కారణంగా పెరిగిపోయిన 22ఎ నిషేధిత జాబితా భూముల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. 22ఎ జాబితా నుండి ప్రయివేట్ భూముల తొలగింపు సరళతరం చేసేలా అధికారాల బదలాయింపు చేశామన్నారు. ఈ జాబితా నుండి ప్రయివేట్ భూములు తొలగించే అధికారం ఆర్డీవోలకు అప్పగించామన్నారు. ఒక వేళ ఏదైనా భూమిని 22ఎ జాబితాలో చేర్చాలంటే ఆ పట్టాదారునికి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ, ఈ కేవైసీ ద్వారా గానీ నోటీసులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఆ తర్వాత కచ్చితమైన విచారణ చేసి సరైన కారణాలతో ఉత్తర్వులు ఇవ్వాలని చెప్పారు. తాను అధికారులతో ప్రత్యేక సమావేశాలు పెట్టి జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టి సామాన్యులకు నష్టం లేకుండా 22ఎ భూముల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పదేళ్లకు పూర్వం అసైన్ చేసిన ఇంటి స్థలాలన్నింటికీ కన్వేయన్స్ డీడీలు ఇస్తామని, ఇక వాటిపై వారికి పూర్తి హక్కులు లభిస్తాయని చెప్పారు. ఇనాం భూములపై జీవోఎం త్వరలోనే పరిష్కారాన్ని చూపుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# తెలుగు భాష సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలి - పద్మశ్రీ దాలిపర్తి ఉమామహేశ్వరి

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తెలుగు భాష, సాంప్రదాయ కళలను పరిరక్షించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పద్మశ్రీ కళా రత్న, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన సాంప్రదాయ కళలను పరిరక్షించుకోకపోతే తెలుగు జాతి అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. సంస్కృత భాష తరువాత 56 అక్షరాలతో సుసంపన్నమైన తెలుగులోనే త్యాగరాజు వంటి ప్రముఖులు కీర్తనలు రాసి గానం చేశారన్నారు. ఎన్సిహెచ్ కృష్ణమాచార్యులు వద్ద సంస్కృత భాషలో హరికథాగానం నేర్చుకుని తెలుగు సంస్కృతాలలో హరికథ గానం చేస్తూ దేశ విదేశాలలో మన్ననలు పొందానని అన్నారు. మన కూచిపూడి నాట్యం జగద్విఖ్యాతి చెందిందన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం యోగ శాఖ ప్రధాన ఆచార్యులు డా. ఎ రాధిక మాట్లాడుతూ యోగ సాధకులు యమ, ప్రాణాయామ, ప్రత్యాహార, సమాధి స్థితులను అధ్యయనం చేయాలన్నారు. దేశ విదేశాలలో నేడు యోగకు ప్రాచుర్యం పెరిగిందని అన్నారు. ఉపాధి



కోసం ఆంగ్ల భాషను అభ్యసించిన తెలుగు భాషను విస్మరించరాదన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వై కే సుందర కృష్ణ మాట్లాడుతూ మన సంప్రదాయాలను మరువరాదన్నారు. సిరి కవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ సంభాషణ రూపంలో చేసిన మేఘసందేశం గానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హరికథకులు మడమల రాంబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సలహాదారు దిట్టకవి వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీ లక్ష్మి, మైనారిటీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ డా. హసీం బేగ్, పరిషత్ కార్యదర్శి ముదిగొండ శాస్త్రి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా అతిథులను, డా చింతలపాటి మురళీకృష్ణ, ఎం రాంబాబు కూచిపూడి నర్తకి శివలెంక ఉషా కిరణ్, నాట్యాచార్యులు వై పూర్ణచంద్రరావు, భగవద్గీత పారాయణి జొన్నలగడ్డ మాధవిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రియులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

# ప్యానెల్ స్పీకర్ గా మండలి



**అమరావతి,కలంకౌంటర్ :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్యానెల్ స్పీకరుగా విధులు నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు విరామ సమయంలో ఆయన ప్యానెల్ స్పీకర్ విధులు నిర్వహించారు. గతంలో నవ్యాంధ్రకు తొలి ఉపసభాపతిగా బుద్ధప్రసాద్ విధులు నిర్వహించారు. ఆయన శాసనసభలో నైతిక విలువల కమిటీ చైర్మనుగా ఉన్నారు.

# కోర్టు కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టండి - కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి,కలంకౌంటర్ :** పట్టణ ప్రణాళిక విభాగంలో ఉన్న కోర్టు కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల పరిష్కారం, బి.పి.ఎస్.,ఎల్.ఆర్.ఎస్, దరఖాస్తులపై శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగంలో పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు పరిష్కారం అయ్యేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. పిటిషన్ దారులతో, న్యాయవాదులతో చర్చించాలని తెలిపారు. గౌరవ హైకోర్టు ఆదేశాలు త్వరగా అమలు ఆయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపీ ఖాన్, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్ కోటేశ్వరరావు, టిపిబి ఓ లు మధు, వంశి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# పందిటి వారి గృహప్రవేశానికి హాజరైన సోమిశెట్టి,తటవర్తి వాసు





**పామూరు,కలంకౌంటర్ :** పామూరు పట్టణంలో కనిగిరి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ వాణిజ్య విభాగ అధ్యక్షులు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు పందిటి హరీష్నూతన గృహప్రవేశ కార్యక్రమమునకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ,రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ మెంబెర్ తటవర్తి వాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పామూరు పట్టణ ఆర్యవైశ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానమునకు తీసుకొని వెళ్లి దర్శనం అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో ఆశీర్వచనం చేయించడం జరిగింది. తదుపరి పందిటి హరీష్ నూతన గృహమునకు విచ్చేసి పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించడం జరిగింది. దేవస్థానం చైర్మన్ కోట నరసింహారావు, సెక్రటరీ గాదంశెట్టి గురునారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, పట్టణ మాజీ సర్పంచ్ సోమిశెట్టి నారాయణ, గోస్టు రామారావు, పామూరు పట్టణ ఆర్యవైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలు తగదు - మాజీ మంత్రి పేర్ని నాని



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శాసనమండలి సమావేశంలో ఫిర్యాదు చేయడానికి వెళ్ళిన వైఎస్ఆర్సిపి నాయకులు దేవదేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాలను చెప్పులు బూట్లు వేసుకుని తాకి అపవిత్రం చేశారంటూ ఆర్థిక మంత్రి కేశవ్ చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి పేర్ని నాని స్పందించారు. లడ్డు కల్తీ వ్యవహారం పై అసత్యాలను ప్రచారం చేస్తూ దేవదేవుడు వెంకటేశ్వర స్వామి కి అపకీర్తి మూట కట్టింది కూటమి ప్రభుత్వం కాదా.అని పేర్ని నాని ప్రశ్నించారు. కోట్లాదిమంది హిందువుల మనోభావాలను కల్తీ నెయ్యి పేరిట వేదనకు గురిచేసిన పాపం కూటమి ప్రభుత్వాన్నీ వదిలి పెట్టదని పేర్ని నాని అన్నారు. హెరిటేజ్ కంపెనీకి వాటారులుగా ఉన్న వ్యక్తులకు.. కూటమి ప్రభుత్వం ఆరోపిస్తున్నట్లుగా కల్తీ నెయ్యిలో ని ముద్దాయిలకు ఉన్న సంబంధాలపై సిబిఐ ఎంక్వయిరీ చేసే దమ్ము కూటమి ప్రభుత్వానికి ఉందా.అని పేర్ని నాని ప్రశ్నించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలోని వ్యక్తులు ప్రత్యక్షంగానో లేక పరోక్షంగానో హెరిటేజ్ సంస్థ అభివృద్ధికి తోడ్పడిన వారే.అని పేర్ని నాని అన్నారు. వ్యాపార కార్యకలాపాలకు భోలే బాబాకు లింకు కలపొద్దు అంటూ కోర్టు నుంచి అడ్రస్ తెచ్చుకున్న హెరిటేజ్ సంస్థ బోలె బాబాకు హెరిటేజ్ సంస్థకు ఉన్న సంబంధాలను వెల్లడించాలని పేర్ని నాని డిమాండ్ చేశారు.

# బీసీ హక్కుల కోసం "బీసీ సింహ గర్జన"

## –జిల్లా అధ్యక్షుడు కోన నాగర్జున పిలుపు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** బీసీవై పార్టీ కృష్ణాజిల్లా కన్వీనర్ కోన నాగార్జున మాట్లాడుతూ, భారత చైతన్య యోజన పార్టీ అధ్యక్షుడు బోడే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "బీసీ సింహ గర్జన" సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. బీసీ రక్షణ చట్టం అమలు, రాజధాని ప్రాంతంలో బీసీలకు తగిన కేటాయింపులు, బీసీ కార్పొరేషన్ నిధుల పెంపు, ఉద్యోగాలు మరియు స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ సభ నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. అధికార పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ అయినా -- బీసీల హక్కుల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన కోరారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు అందరూ ఐక్యంగా ఈ సభలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సభా ఏర్పాట్లు నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ మహాసభ జరగనుంది. విజయవాడ బస్టాండ్ వద్ద నుంచి సభా ప్రాంగణానికి ప్రత్యేక వాహనాల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మచిలీపట్నం హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి కూడా వాహనాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పాల్గొనదలచిన వారు 9770879999నంబర్‌కు సంప్రదించాలని, ఉదయం 6 గంటల నుంచి రాత్రివరకు ఫోన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మచిలీపట్నం, గుడివాడ, పామరు ,అవనిగడ్డ పెనమలూరు, గన్నవరం తదితర నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ప్రభుత్వం ఐదేళ్లు పరిపాలిస్తుంది. కానీ ఈ ఐదేళ్లలో బీసీల కోసం పోరాడే మన నాయకుడు కోసం మన హక్కుల కోసం ఒక రోజు కేటాయించి బీసీ సింహ గర్జనను విజయవంతం చేద్దాం" అని కోన నాగర్జున పిలుపునిచ్చారు.

# మహిళలు , పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యత - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి రక్షణకు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, భద్రత చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించుటలో భాగంగా పోలీసు స్టేషన్లను ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలతో పోలీసు సిబ్బంది మర్యాదగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, వారి చెప్పే ఫిర్యాదులపట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా, విధిగా కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను శక్తి బృందాలు, ఇతర పోలీసు సిబ్బంది సందర్శించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగు, వారికి రక్షణగా నిలిచే చట్టాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో పోలీసులు సహాయం పొందే విధానంపట్ల అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ తరుపున చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తమ పోలీసు స్టేషను పరిధి లోని ముఖ్య కూడళ్ళు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలను, బస్టాండులు మరియు రైల్వే స్టేషన్ లను సందర్శించి ప్రజలు, మహిళలు, విద్యార్థినులతో మమేకమై, వారికి అర్ధమయ్యే రీతిలో మహిళల రక్షణకు బాసటగా నిలిచే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. డ్రోన్ లను వినియోగించి శివారు ప్రాంతాలు, మరియు ఖాళీ ప్రదేశాలలో నిఘా ఏర్పాటుచేస్తున్నామని తెలిపిన జిల్లా ఎస్పీ. మహిళలు మరియు పిల్లల పై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రౌడీ షీట్స్ తెరుస్తామని, జైలుకు పంపుతామని హెచ్చరించిన జిల్లా ఎస్పీ.

# జ్ఞాన యాన్ నుండి గగన్ యాన్ వరకు అట్కిన్సన్ సీనియర్ సెకండరీ స్కూల్ చిన్నారుల అద్భుత ప్రతిభ

**●చిన్నారుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడమే లక్ష్యం ● స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ రజిత**

**విజయవాడ,కలంకౌంటర్ :** ఇస్రో పరిశోధనా కేంద్రాన్ని తలపించేలా విజయవాడలోని అట్కిన్సన్ సీనియర్ సెకండరీ స్కూల్ ప్రాంగణంలో రాకెట్ లాంచింగ్ కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. ఇంటెగ్రిటీ ఏరోస్పోర్ట్స్ సంస్థ ఫౌండర్ లాజరస్ సామ్రాట్ రాకెటరి సంస్థ వారి శిక్షణతో అట్కిన్సన్ సీనియర్ సెకండరీ స్కూల్లోని సైన్స్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాలలోని 6,7,8 తరగతుల విద్యార్థులు రూపొందించిన రాకెట్లు నింగికెగిసాయి. కార్యక్రమంలో భాగంగా కెమికల్ మోటార్, పీవీసీ ఫోం బోర్డు, పాలికార్బోనేట్, లైట్ వెయిట్ ఇంపోర్టెడ్ బల్సాఉడ్ తదితర మెటీరియల్ను ఉపయోగించి చిన్నారులు తమ చేతులతో స్వయంగా రూపొందించిన రాకెట్లు పొగలు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లాయి. కేవలం ప్రదర్శన కోసం కాకుండా రియల్ రాకెట్లతో పోటీపడుతూ ఎగిసిన రాకెట్లు చిన్నారుల ఉత్సాహం, కేరింతలు నడుమ సుమారుగా ఒక కిలోమీటరు దూరం ఆకాశంలోకి దూసుకెళ్లాయి. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ రజిత మాట్లాడుతూ, ఈ నెల 28న నేషనల్ సైన్స్ డే ను పురస్కరించుకుని విద్యార్థుల్లో సృతజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో రాకెట్ లాంచింగ్ కార్యక్రమమును రూపొందించినట్లు తెలిపారు. ఇంటిగ్రిటీ సంస్థ వ్యవస్థాపకుడు సామ్రాట్ మాట్లాడుతూ, పాఠ్యాంశాల్లో నేర్చుకున్న విద్యను విద్యార్థులు ప్రాక్టికల్గా ప్రత్యక్షంగా అమలుచేసే స్టెమ్ విధానంలో మోడల్ రాకెట్రీ ప్రొగ్రామ్ నిర్వహించినట్లు తెలిపారు. రాకెట్ లాంచింగ్ ప్రయోగంలో భాగంగా 200 మంది విద్యార్థులు రెండు రోజులపాటు జరిగే రాకెట్ లాంచింగ్లో 60 రాకెట్లను ప్రయోగించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా



రాకెట్ నమూనాలను రూపొందించిన విద్యార్థులకు రాకెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇంటిగ్రిటీ ఏరోస్పోర్ట్స్ సంస్థలు తరపున ఉత్తమ ప్రతిభా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ గ్రేసి, సైన్స్ విభాగాధిపతి జాకీరా రెహమాన్, ఉపాధ్యాయులు యాంజలీనా, వివేకానంద, ధనశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు మనవరాలు నామకరణ సందర్భంగా ఆశీర్వదించిన దృశ్యం**

–ప. గో. జిల్లా,కలంకౌంటర్ :

# మండల ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకారం.. ముఖ్య అతిథిగా సి హెచ్ ఆర్





**తాళ్లపూడి, కలంకౌంటర్ :** ఆర్యవైశ్య కుటుంబాల్లో ఇటీవల యుక్త వయస్సు దాటిపోతున్నా వివాహాలు చేయటం గురుంచి మంచి ఆలోచన చేయటం లేదని, అలాగే పిల్లల్లో దైవం పట్ల శ్రద్ధ పెరిగేలా వాసవి చరిత్ర పఠనం నేర్పించాలని రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం శ్రీ సొలస దమయంతి కళ్యాణ మండపం తాళ్లపూడి లో తాళ్లపూడి మండల ఆర్య వైశ్య సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి మండల ఆర్య వైశ్య సంఘ నూతన కమిటీ తో పాటు తాళ్లపూడి పట్టణ ఆర్యవైశ్య సంఘం, మరియు మహిళ సంఘ నూతన కమిటీల తో జిల్లా అధ్యక్షులు వెలగా శ్రీరామ మూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ దాన గుణం, సేవా గుణం లో ఆర్య వైశ్యులు ముందు ఉండడం తో పాటు రాజకీయాల్లో కూడా చురుకు గా ఉండాలని అని అన్నారు. జనాభాలో అధిక సంఖ్య లో ఉన్నప్పటికీ, ఆర్య వైశ్యులు మైనారిటీ ల గానే ఉన్నామని, ఎన్నో సేవ కార్య. క్రమాలను స్వంత సంపాదనతో ఖర్చు చేసే ఆర్యవైశ్యులు కులగణన లో ఆర్య వైశ్యులుగా నమోదు చేయించు కోవాలని కోరారు. తాళ్లపూడి మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వ హించారు. తాళ్లపూడి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా అప్పన రాజా, కార్యదర్శి గా గోకవరపు మాణిక్యం, ఉపాధ్యక్షులు గా కొండూరి ప్రసాదరావు, మండా శ్రీనివాసరావు, కొత్త చిన్నబాబు, సహాయ కార్యదర్శి కొత్త నాని, కోశాధికారిగా కొల్లేపర అయ్యప్ప, కార్యవర్గ సభ్యులు గా టి.ఎన్.బి. గుప్త, శ్రీకాకోళపు రామకృష్ణగా పదవి ప్రమాణ స్వీకారం చేసారు. అనంతరం మహిళా సంఘం చేత కూడా ప్రమాణ స్వీకారం చేయించారు . ఈ కార్య క్రమానికి రైస్ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సింహాద్రి జనార్దన రావు అధ్యక్షత వహించారు. సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా వున్నారు. ప్రమాణ స్వీకారానికి ముందుగా అతిధులు స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం లో నుదురుమాటి శ్రీనివాస్, వందనపు జగన్నాధం, నారాయణపు విశేశ్వ రావు, కొండూరి శ్రీరామ చంద్ర మూర్తి, అప్పన జగదీశ్, అధిక సంఖ్యలో పలు ప్రాంతాల నుంచి ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాని కి ప్రత్యేక వ్యాఖ్యాతగా పరస రాధాకృష్ణ వ్యవహరించారు.

# ఏపీలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గింది

**● సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు ● గత ప్రభుత్వంలో మహిళలు బయటకు రావడానికి భయపడేవాళ్లు ● కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది ● తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు.గీత దాటితే కటకటాలే...హోం మంత్రి అనిత.**

**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీలో వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే కూటమి నాయకత్వంలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గిందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. హోంశాఖ బడ్జెట్ డిమాండ్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైసీపీ కార్యకర్తలు రప్పా రప్పా అంటూ రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని మంత్రి అనిత హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని, అది లేకనే గత ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో లా అండ్ ఆర్డర్ చక్కగా పనిచేయడం వల్లే క్రైమ్ రేట్ తగ్గిందన్నారు. అందుకే దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో మహిళలు బయటకు రావడానికి కూడా భయపడేవాళ్లు అని, చట్టబద్ధత లేని దిశా యాప్ పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి పాలనలో కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు కట్టుబడి ఉందన్నారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ తో మహిళా రక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకే రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని స్పష్టం చేసారు.తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, గీత దాటితే కటకటాలే అని హెచ్చరించారు.సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు వివిధ కార్యక్రమాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం అన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన సమావేశం




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** వయో వృద్ధుల సంక్షేమ సంఘం మరియు హెల్ప్ ఏజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీ & సైబర్ నేరాలపై అవగాహన సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో వయోజనులకు డిజిటల్ భద్రత ప్రాముఖ్యతను వివరించి, పెరుగుతున్న సైబర్ మోసాలపై , స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (TG & AP), హెల్ప్ ఏజ్ ఇండియా, హైదరాబాద్ శ్యాం కుమార్ అవగాహన కల్పించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, APK ఫైల్ మోసాలు, AI మార్ఫింగ్, ఆర్థిక మోసాలు, అకౌంట్ నిధుల మళ్లింపు వంటి కొత్త తరహా సైబర్ దాడులపై సవివరంగా ప్రొజెక్టర్ సాయంతో వివరించారు. అలాగే సమావేశంలో సైబర్ నేరాలు ఎన్ని రకాలుగా జరుగుతున్నాయి వాటి పై అవగాహన కల్పించడం, వాట్సాప్ సందేశాలు, APK ఫైల్‌లు, సురక్షిత వెబ్‌సైట్ లింక్‌లను గుర్తించే విధానం. – ఆన్‌లైన్ మోసాల నివారణకు అవసరమైన చిట్కాలు– డిజిటల్ సేవలను ధైర్యంగా వినియోగించే మార్గదర్శకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వయోజనులు డిజిటల్ సేవలను సురక్షితంగా వినియోగించే నైపుణ్యం పొందడం, ఆన్‌లైన్ మోసాల నుండి రక్షణ–, సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం తదితర అంశాల ప్రయోజనాలను వివరించారు. "వయోవృద్ధులకి ఆన్లైన్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ క్రైమ్ రహిత రాష్ట్రంగా రూపొందించడం హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ యొక్క బాధ్యత అన్నారు. మీ భద్రత -- మా బాధ్యత" అని వయోజనులకు డిజిటల్ భద్రతా పద్ధతులను పాటించమని సూచించారు. ఈ విషయంపై సందేహాలకు హెల్ప్ ఏజ్ ఇండియా 24 గంటల వయోజనుల సహాయకేంద్రం: 1800 180 1253 అందుబాటులో ఉంది ఉందని అవగాహన కార్యక్రమంలో తెలిపారు ఈ కార్యక్రమంలో బంటుమిల్లి పట్టణ బార్ అసోసియేషన్ నాయకులు ఏళ్ళ సోమశేఖర్, సుజ్ఞానం జనార్దన్ రావు, మరియు సీనియర్ సిటిజన్స్ సంఘం వ్యవస్థాపక నాయకులు గంగాజాలరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లో ఎమ్మెల్యే సతీమణి సౌజన్య పుట్టినరోజు వేడుకలు

## – అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్న వితరణ





**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య పుట్టినరోజు సందర్భంగా... పట్టణంలోని అన్న క్యాంటీన్ లో శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కేక్ కటింగ్ నిర్వహించారు.సౌజన్య ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని, మరెన్నో పుట్టినరోజులు సంతోషంగా జరుపుకోవాలని నేతలు ఆకాంక్షిస్తూ సౌజన్యకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం గుర్రం రాజ్యలక్ష్మి సహకారంతో అన్న క్యాంటీన్లో ఉదయం పూట పేదలకు అల్పాహారం అందించారు. మధ్యాహ్నం ఆర్యవైశ్య మహిళలు కేకు కటింగ్ చేసి, పేదలకు ఉచితంగా అన్న వితరణ చేశారు. ఎమ్మెల్యే సతీమణి కి వీడియో కాల్ లో ఆర్యవైశ్య మహిళలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మీ అందర ఆదరభిమానాలు ఎల్లవేళలా ఇలానే ఉండాలని ఎమ్మెల్యే సతీమణి సౌజన్య ఆకాంక్షించారు. సాయంత్రం రేషన్ డీలర్లచే అన్న వితరణ జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముచ్చు రాజ్యలక్ష్మి, పార్టీ నేతలు చిలకపాటి మధు, షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, వడ్డేళ్ళ రవిచంద్ర, ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య నాయకులు, రేషన్ షాప్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఎమ్మెల్సీ సవాల్ కు మంత్రి సుధారాణి కౌంటర్

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వెంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకుని చెప్పులు, బూట్లతో ఆందోళన చేపట్టడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫొటో లేదా వీడియో చూపిస్తే ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానని ఛాలెంజ్ చేశారు. వెంటనే స్పందించిన మంత్రి సంధ్యారాణి వైసీపీ సభ్యులు చెప్పులతో ఉన్న వీడియోను బయటపెట్టారు. "స్వామి వారి ఫొటోలను ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గం. ఒకరు తలకిందులుగా పట్టుకున్నారు, ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారు. వీళ్లకు దేవుడంటే భయం, భక్తి లేవు. దేనికోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి. వికృత చేష్టలతో స్వామివారిని అవమానించడం కలచివేస్తోంది" అని విమర్శించారు. మాధవరావు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# చరిత్రలో నిలిచిపోయేలా అమరజీవి విగ్రహం నిర్మాణం

- అమరావతి లో 6.8 ఎకరాల్లో
- రూ 150 కోట్లతో నిర్మాణం
- మార్చి 16 న ఆవిష్కరణ

- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం



ఫైల్ ఫోటోలు



ఫైల్ ఫోటోలు







**అమరావతి,కలంకౌంటర్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి గౌరవంగా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయేలా బృహత్తర కార్యక్రమం చేపట్టింది.ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహానుభావుడు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోవాలన్న సంకల్పంతో అమరావతిలో శాకమూరు వద్ద 6.8 ఎకరాల్లో , రూ 150 కోట్లతో, 58 రోజులు దీక్షకు గుర్తుగా 58 అడుగులు అమరజీవి కాంస్య విగ్రహం నిర్మాణం ప్రారంభించింది.పనులు శరవేగంగా సాగుతున్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం, పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న అమరజీవి విగ్రహ నిర్మాణం పట్ల అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

**ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన..** ఆ మహనీయుడి త్యాగనిరతిని భావితరాలకు తెలియజేసేందుకు శాఖమూరు వద్ద 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో ఆయన విగ్రహాన్ని ప్రభుత్వం నిర్మిస్తోంది. పొట్టిశ్రీరాములు 125వ జయంత్యుత్సవాల ముగింపు సందర్భంగా వచ్చేనెల 16న దీన్ని ఆవిష్కరించనున్నారు. ఆయన 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసినందుకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం రూపుదిద్దుకుంటోంది. మార్చి 16న పొట్టి శ్రీరాములు జయంతిని, డిసెంబరు 15న ఆత్మార్పణ దినాన్ని ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర కార్యక్రమాలుగా ప్రకటించింది.

**ట్రస్టు ఆధ్వర్యంలో పనులు..** పొట్టిశ్రీరాములు విగ్రహం, స్మృతివనం నిర్మాణానికి ప్రభుత్వం రాజధానిలో 6.8 ఎకరాల భూమి కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు రూ.150 కోట్లు వ్యయమవుతుండగా.. అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ భరిస్తోంది. ఇ-9, ఎన్-15 రహదారుల పక్కన పశ్చిమాభిముఖంగా ప్రతిష్ఠించే ఈ విగ్రహ నిర్మాణానికి మంత్రి లోకేశ్ 2025 సెప్టెంబరు 3న శంకుస్థాపన చేశారు. అక్టోబరులో పనులు ప్రారంభించారు. కృష్ణా జిల్లా బొమ్మలూరుకు చెందిన కళాకారులు అక్కడే విగ్రహ భాగాలకు ఆకృతినిస్తూ, దశల వారీగా రాజధానికి తరలిస్తున్నారు. ఇప్పటికే రెండు భాగాలు చేరుకున్నాయి. రెండంతస్తుల వేదికపై విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. వేదిక, విగ్రహం కలిపి మొత్తం ఎత్తు 110 అడుగులు. వేదిక నిర్మిత ప్రాంతం 17 వేల చదరపు అడుగులు. గ్రౌండ్ ఫ్లోర్లో 100 మంది కూర్చునేలా మినీ థియేటర్, మ్యూజియం, లైబ్రరీ ఉంటాయి. మినీ థియేటర్ లో పొట్టిశ్రీరాములు జీవిత విశేషాలతో కూడిన 15 నిమిషాల వీడియోను సందర్శకులకు ప్రదర్శిస్తారు. ఆయన వాడిన వస్తువులు, ప్రముఖులకు రాసిన లేఖలను మ్యూజియంలో ఉంచుతారు. మొదటి అంతస్తులో ధ్యాన మందిరం ఉంటుంది. 9 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అక్కడ ఆసీనులైన భంగిమలో నిర్మిస్తున్నారు. ధ్యానమందిరంపై కమలం ఆకారంలో పీఠం నిర్మించి, దానిపై విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. పైనుంచి చూస్తే కమలం మధ్యలో మనిషి నిలబడ్డట్టుగా కనిపిస్తుంది. ఎనిమిది కమలం రేకులు (పెటల్స్) అమరుస్తున్నారు. ఒక్కో రేకు ఎత్తు 22.50 అడుగులు. వాటిని ముంబయిలో తయారు చేయించారు. మొత్తం బరువు 100 టన్నులు కాగా, విగ్రహాన్ని 30 టన్నుల కంచుతో తయారు చేస్తున్నారు. పీఠంపై విగ్రహాన్ని నిలబెట్టేందుకు లోపల 70 టన్నుల బరువైన ఇనుప గడ్డర్లు వాడుతున్నారు. మొదటి దశలో భాగంగా మార్చి 16 నాటికి రెండంతస్తుల వేదిక, విగ్రహం సిద్ధం చేసి, విగ్రహావిష్కరణ చేస్తారు. రెండో దశలో మరో 2,000 సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం, పార్క్ అభివృద్ధి చేస్తారు. దీనికి ఏడాది సమయం పడుతుంది.

**ఏటా వెయ్యి మందికి సహాయం..** పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం ఆయన విగ్రహ ఏర్పాటు, నిర్వహణకే పరిమితం కాకుండా..

పలు సేవా కార్యక్రమాలూ నిర్వహిస్తుందని మేనేజింగ్ ట్రస్టీ డూండీ రాకేశ్ తెలిపారు. ప్రాథమికంగా ప్రతి సంవత్సరం వెయ్యి మందికి విద్య, వైద్య సహాయం, పేదరికంలో ఉన్నవారికి చేయూత వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఆ సంఖ్య పెంచుతామన్నారు. 20 కోర్సులతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పి, పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు జీఎంఆర్ సంస్థ ఆసక్తిగా ఉందని రాకేశ్ పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పేదలకు ట్రస్ట్ తరపున సాయమందిస్తామని, పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని నందనవనంలా తీర్చిదిద్దుతామని తెలిపారు..









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com